# ఫ్యూడల్ విలువలు ప్రజాస్వామ్యానికి ప్రమాదం

అందరిదీ ఒకే మాట - 'పోయినోళ్లు అందరూ మంచోళ్లు'.

రాజకీయవేత్తలు, విప్లవకారులు, రచయితలు, పాత్రికేయులు, మేధావులు, బుద్ధిజీవులు... అందరూ బుద్ధిలేనిజీవుల్లా మారి అకాలమరణం పొందిన ఒక రాజకియ నాయకుడికి నివాళులర్పించడంలో భావోద్వేగాలకు లోనై objectivityని కోల్పోతున్నారు.

వై.యస్. రాజశేఖరరెడ్డి దుర్మరణం నిజంగా విషాదం. ఆయన అకాల మరణానికి వ్యక్తులుగా ఎవరైనా చింతించడం, దానిని వ్యక్తీకరించడం సహజం. అయితే అవధులు దాటిన మోహంతో ఆయన వ్యక్తిత్వాన్ని ఆకాశానికెత్తే ప్రయత్నంలో మౌలిక విషయాల్నీ, ప్రజాస్వామిక విలువల్నీ పట్టించుకోకపోవడం క్షమార్హం కాదు. దివంగత నాయకునిపై వస్తున్న పత్రికా వ్యాసాలు, టీవీ ప్రసంగాలలో ఈ మోహావేశం ప్రస్ఫుటంగా కనిపించింది.

వైఎస్సార్ భూస్వామ్య, ఫ్యాక్షన్ నేపథ్యంలోంచి వచ్చి రాజకీయ వ్యాపారవేత్తగా ఎదిగిన ముఠానాయకుడు. తనకూ తన కుటుంబానికీ తన వాళ్లకూ వ్యాపార  రాజకీయ మహాసామ్రాజ్య నిర్మాణంకోసం కృషిచేసారు. ఈ యజ్ఞానికి అడ్డువచ్చిన ఎందరో సమిధలయ్యారు - భౌతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా. ఈ మహాకార్యంలో ఆయన 'పట్టుదలను,  సమర్థతను, స్థిరచిత్తాన్ని, పనిరాక్షసత్వాన్ని' దర్శించాలంటారు కొందరు. 'తనవాళ్లకు' ఈ యజ్ఞఫల తిలాపాపాన్ని తలాపిడికెడు పంచగలిగారాయన. ఇందులో అతని 'దాతృత్వాన్నీ, స్నేహశీలతనూ, ఆత్మీయతనూ, వెచ్చని కరస్పర్శనూ' ప్రశంసించి తీరాలంటారు. వీళ్లు ఇంతగా పొగుడుతున్న వైఎస్సార్‌లోని లక్షణాలు కేవలం భూస్వామ్య విలువలకు ప్రతీకలు. స్లోపాయిజన్‌లా పనిచేస్తూ ప్రజాస్వామ్య విలువలను మంటగలిపేవవి.

వైఎస్ కోసం అంతమంది చనిపోవడం ఆయనపై గుండెలనిండా ఉన్న అభిమానం వల్లనేనని అంటున్నారు - పాత్రికేయులతో పాటు కొత్త రాజకీయాలగురించి వల్లించేవారు కూడా. ఆ చనిపోయినవారిలో సెజ్ బాధితులు, భోలక్‌పూర్ కలుషిత జలయజ్ఞ బాధితులూ, భీంరావ్‌బాడ నిర్వాసితులూ, వాకపల్లి వాస్తవ్యులూ ఎవరైనా ఉన్నారనుకోను. నిజంగానే తమ అభిమాన నాయకుడి మృతిని తట్టుకోలేక చనిపోయిన వారిని అవమానించడం కాదిది. విషయానికి మసిపూసి వైఎస్ చేసిన పాపాలన్నీ ఈ అభిమాన గంగాతరంగాలలో పటాపంచలైనట్లు మాట్లాడడం పట్ల, భ్రమాన్వితులవుతున్న ప్రజలను ఇంకా ఇంకా అందులోనే కూరుకుపోయేలా యథాశక్తి ప్రయత్నించడం పట్ల అభ్యంతరమిది.

ఇరాక్ యుద్ధం సందర్భంగా ప్రాచుర్యంలోకి వచ్చిన Embedded Journalism గురించి 'ఆర్మీటైమ్స్' పాత్రికేయుడు Gina Cavallaro అంటాడు "Journalists are relying more on the military to get them where they want to go, and as a result, the military is getting smarter about getting its own story told".

మన దగ్గర కూడా ఇలాంటి 'Embedded Intellectuals' తయారవుతున్నారు. వైఎస్సార్ సహాయం అందుకున్నవారు - కవులూ, రచయితలూ, పాత్రికేయులూ, నూతన రాజకీయ సంస్కృతి గురించీ, మార్పు గురించీ వల్లించే రాజకీయపార్టీల నాయకులూ - అందరూ ఆయన 'మంచి'తనానికి మురిసిపోతున్నారు.

నేనంటున్న సహాయం ఆర్థికమే కానక్కరలేదు. ప్రాజెక్టులకు కమ్యూనిస్టునాయకుల పేరుపెట్టడం కావచ్చు, కమ్యూనిస్టు నాయకుడి చికిత్స నిమిత్తం డయాలసిస్ యంత్రం కొనుగోలును ఆమోదించడం కావచ్చు, వేడివేడి ఫలహారం, వెచ్చని కరస్పర్శ కావచ్చు, మల్లెపూవుల్లాంటి బట్టల్లో కనిపించే పల్లెటూరి పెద్దతరహా తత్వం కావచ్చు. మనకు తెలియని, వారు ఉటంకించని మరేవైనా కావచ్చు. అన్నిటికన్నా ముఖ్యంగా ప్రాపంచిక దృక్పథ లేమితో కొట్టుమిట్టాడుతూ ఫ్యూడల్ సూరీడు ప్రసరింపజేసిన వ్యక్తిగత మంచితనపు వెలుగులలో తరించిపోవడం కావచ్చు. ఈ వెలుగుల వేడిలో శలభాలవుతున్న వ్యవస్థల గురించి పట్టింపు లేకపోవడం కావచ్చు.

అందుకే - స్వార్థచింతనతో, వ్యక్తివాదంతో, అహంకారంతో, క్రూరత్వంతో, అప్రజాస్వామిక విధానాలతో అన్ని వ్యవస్థల్నీ ధ్వంసం చేసి, అన్ని విలువల్నీ నాశనం చేసి మేధావుల్నీ, బుద్ధిజీవుల్నీ, రాజకీయ నాయకుల్నీ, పాత్రికేయుల్నీ, చివరికి ప్రజల్నీ మానసిక బానిసత్వంలో ముంచి వారికి దొడ్డువో సన్నవో నూకలు విదిలిస్తూ, చిన్నవో పెద్దవో పనులు చేసిపెడుతూ, ఉన్నవో లేనివో కబుర్లు చెపుతూ, అయినవో కానివో ఆశలు చూపుతూ; వెచ్చని స్పర్శమాటున, చల్లని చూపుల మాటున విచ్చలవిడి దోపిడీకి పాల్పడిన వైఎస్ మొహం అద్దంలో అందంగా కనపడింది. అద్దం బాగానే ఉన్నది - లోపం మొహంలో ఉన్నది. దానిని గుర్తించని వారి, లేదా గుర్తించ నిరాకరించే వారి మోహంలో ఉన్నది.

వ్యవస్థల్ని వదిలేసి వ్యక్తిపూజ చేయడం ప్రమాదకరం. ఈ ధోరణికి కారణం ఫ్యూడల్ విలువలు ప్రజాస్వామ్య విలువల మధ్య దూరం తగ్గడం. వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతే ఎవరిని నిందించీ ప్రయోజనం లేదు. జనసామాన్యాన్ని మానసిక బానిసత్వ బంధనాల్లోంచి శాశ్వతంగా విముక్తం చేయడం తక్షణ కర్తవ్యం. సత్వర సమత ద్వారా ప్రజల్ని సాధికారుల్ని చేయడం, వ్యక్తుల ప్రయోజనాలు కాకుండా వ్యవస్థల గురించి ఆలోచించడం మొదలుపెడదాం. ఆ దిశగా నిరంతరం తపిస్తున్న, దిశానిర్దేశం చేస్తున్న తెలుగుదేశంపార్టీ నాయకత్వ స్ఫూర్తితో ముందుకు సాగుదాం.

- శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
(సామాజిక కార్యకర్త, తెలుగుదేశం సాంకేతిక నిపుణుల విభాగం ఉపాధ్యక్షుడు)
Hyderabad, 26 September, 2009